ఏమి రోడ్డు బాసూ!

- వడ్డాది జంక్షన్‌లో మరింత విశాలంగా బీటీరోడ్డు
- ఫలించిన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కృషి



వడ్డాది వేంకటేశ్వరస్వామి ఆర్చి వద్ద వేస్తున్న తారు రోడ్డు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కృషి ఫలించింది. పదేళ్లుగా పెద్ద పెద్ద గోతులతో అధ్వానంగా తయారైన బీటీరోడ్డు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గోతుల్లో రాకపోకలు సాగించే వాహన చోదకులకు మోక్షం కలిగింది. బుచ్చెయ్యపేట మండలం మేజర్ పంచాయతీ వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్‌లో రూ.75 లక్షలతో విశాలంగా తారురోడ్డు ఏర్పాటు చేశారు. ఇక్కడి వడ్డాది జంక్షన్ మీదుగా విశాఖ నగరం, పాడేరు, నర్సీపట్నం, చోడవరం పట్టణ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో గత టీడీపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకుండా నిర్లక్ష్యం చేయడంతో రోడ్డు మొత్తం పెద్ద పెద్ద గోతులు ఏర్పడి అధ్వానంగా తయారైంది. దాంతో వందలాది మంది వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. తరచూ వాహనాలు సైతం మరమ్మతులకు గురై మోరాయించేవి. దీనికితోడు ఏ మాత్రం వర్షం కురిసిన తటాకాన్ని తలపించేలా నాల్గు రోడ్ల జంక్షన్‌లో మోకాల లోతు వరకు నీరు చేరేది. దుకాణాల్లోకి సైతం నీరు చేరడంతో వ్యాపారాలు దెబ్బతినేవి. దాంతో స్థానికులు, వ్యాపారులు నాల్గు రోడ్ల జంక్షన్‌లో నీటి ముంపు సమస్య లేకుండా చేయాలని ఆందోళనలు చేశారు. అదే సమయంలో ఈ సమస్య పరిష్కరించాలని కోరుతూ ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టిల దృష్టికి తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ విప్ ధర్మశ్రీ కృషితో ప్రభుత్వం రూ. 75 లక్షలు మంజూరు చేసింది. ఈ మొత్తంతో ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు చకచకా పనులు మొదలు పెట్టారు. తొలుత నాల్గు రోడ్ల జంక్షన్‌లో రోడ్డు ఆక్రమణలు తొలగించారు. ఆ తర్వాత రోడ్డుకు ఇరువైపులా వర్షం నీరు బయటకు పోయేలా సిమెంట్ కాలువలు తవ్వించారు. 30 అడుగుల వెడల్పుతో తారురోడ్డు పనులు చేపట్టారు. ఈ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి వాహనదారులకు సుఖ ప్రయాణం కల్పించారు. రోడ్డు ఏర్పాటుతో వడ్డాది నాల్గు రోడ్ల జంక్షన్‌లో నీటి ముంపు, గోతులు, దుమ్ము,ధూళి సమస్య తీరింది. నిధులు మంజూరు మేరకు వడ్డాది జంక్షన్‌లో పనులు చేపట్టామని ఆర్‌అండ్‌బి జేఈ సాయి శ్రీనివాస్ తెలిపారు.



వడ్డాది జంక్షన్‌లో విశాలంగా వేసిన రోడ్డు

క్లుప్తంగా

జాబ్ కార్డుదారులకు ఉపాధి పనులు



ఎ.భీమవరం గుండాల చెరువులో ఉపాధి పనులను పర్యవేక్షిస్తున్న ఏపీవో వసంత్

కె.కోటపాడు: మండలంలోని 32 పంచాయతీల్లో ఉపాధి హామీ పనులకు జాబ్‌కార్డుదారులు హాజరు కావాలని ఏపీవో వసంత్ కోరారు. ఎ.భీమవరంలో గుండాల చెరువు, సూదివలస గ్రామాల్లో ఉపాధి పనులను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేతనదారుల రోజు వారి గరిష్ట వేతనం రూ.257 పొందేలా పనులు చేయాలన్నారు. స్వగ్రామాల్లోనే ఉపాధి పనులకు వేతనదారులు హాజరు కావడం వల్ల పనితోపాటు గ్రామాభివృద్ధి చెందుతుందన్నారు. ఎ.భీమవరంలో గుండాల చెరువులో పూడిక తీత, చెరువుగట్టు పటిష్టత పనులు రూ.3.50 లక్షల ఉపాధి నిధులతో చేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి భీమరాజు పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ



క్రీడా దుస్తులను అందిస్తున్న సర్పంచ్ దేముళ్లు, సాయికుమార్

కె.కోటపాడు: చదువుతోపాటు క్రీడల్లోను యువకులు రాణించాలని సర్పంచ్ బండారు దేముళ్లు ఆకాంక్షించారు. గుల్లేపల్లి గ్రామానికి చెందిన పశువైద్య సహాయకుడు ఆర్.సాయికుమార్ రూ.10 వేలతో 12 మంది క్రీడాకారులకు క్రీడా దుస్తులతోపాటు రెండు వాలీబాల్‌లను సమకూర్చారు. తన తాతయ్య స్వర్గీయ రెడ్డి రాము జ్ఞాపకార్థంగా వీటిని అందించినట్లు తెలిపారు.

167 మందికి వైద్య పరీక్షలు



వైద్య పరీక్షలను చేస్తున్న వైద్యాధికారి జాహ్నవి

కె.కోటపాడు: ఫ్యామిలీ ఫిజీషియన్ వైద్య సేవల ద్వారా గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందనుందని లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి జాహ్నవి తెలిపారు. శనివారం ఎ.కోడూరులో 167 మందికి వైద్య సేవలతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. బీపీ, సుగర్ పరీక్షలతోపాటు గర్భిణులకు ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పి.త్రినాథ్, ఎంఎల్‌హెచ్‌పీ శాంతి, హెచ్‌వి.భాగ్యలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



మాత్రలు పంపిణీ చేస్తున్న ఏఎన్ఎం రాజేశ్వరి, హెల్త్ అసిస్టెంట్ హరిబాబు

రోలుగుంట: బుచ్చింపేట పీహెచ్‌సీ పరిధిలోని అర్ల గిరిజన పంచాయతీ శివారు లోసింగి గిరిజన గ్రామంలో శనివారం జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా బడిబయట ఉన్న 46 మందికి హెల్త్ అసిస్టెంట్ రుత్తల హరిబాబు, ఏఎన్ఎం రాజేశ్వరి నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని వైద్యాధికారి శ్రీనువాస్ రాజు పర్యవేక్షించారు. అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మ పాల్గొన్నారు.

నేడు కొవ్వూరు నూకాంబిక పండగ

రోలుగుంట: మండలంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా ఆదివారం నిర్వహించనున్న నూకాంబిక పండగకు ఏర్పాట్లు పూర్తయినట్టు నిర్వాహకులు తెలిపారు. భక్తులు ఆదివారం వేకువజాము నుంచి అమ్మవారికి పసుపు కుంకుమ సమర్పించుకుని అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. ఆ రోజు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించునున్నామని, భక్తులు తరలివచ్చి ప్రసాదం స్వీకరించాలన్నారు.

గిరిజనేతరుడికి కొమ్ము కాస్తున్న రెవెన్యూ



మాట్లాడుతున్న ఉద్యమ నాయకుడు అజయ్‌కుమార్

పెద్ద ఎత్తున ఆదివాసీల ర్యాలీ, ధర్నా

రోలుగుంట: తరతరాలుగా సాగులో ఉన్న ఆదివాసీలకు నష్టం కలిగిస్తూ గిరిజనేతరుడికి కొమ్ము కాస్తున్న రెవెన్యూ యంత్రాంగం తీరును నిరసిస్తూ శనివారం అఖిల భారత ఆదివాసీ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున గిరుజనులు ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక గ్రామీణ బ్యాంకు నుంచి ఆర్‌అండ్‌బీ రోడ్డు మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకూ ప్రదర్శన చేశారు. చటర్జీపురం గదబ ఆదివాసీ కుటుంబాలకు న్యాయం చేయాలని, సాగులో ఉన్న వారి పేర్లను తొలగించి గిరిజనేతరుడు పేరును పొందుపరిచిన తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా అఖిల భారత్ ఆదివాసీ సంఘం నాయకుడు పి.ఎస్.అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఎం.కె.పట్నం రెవెన్యూ సర్వే నంబర్ 139లో పదెకరాల మెట్ట భూమిలో చటర్జీపురానికి చెందిన నాలుగు గదబ ఆదివాసీ కుటుంబాలు సాగు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. గత తహసీల్దార్ ఈ వాస్తవాన్ని గుర్తించి వారి పేర్లను సాగుదారులుగా నమోదు చేశారన్నారు. ప్రస్తుతం కాకినాడ జిల్లాకు చెందిన గిరిజనేతరుడి పేరును రికార్డులో చేర్చారని తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావుకు స్పందనలో ఫిర్యాదు చేశామన్నారు. అక్కడ వాస్తవాల అమలుకు తహసీల్దార్ భిన్నంగా వ్యవహరిస్తుండటంతో ఆందోళనకు దిగాల్సి వచ్చిందన్నారు. న్యాయం చేసే వరకూ ఆందోళన కొనసాగుతుందని స్పష్టం చేశారు. గొలుగొండ, నాతవరం తదితర మండలాల నుంచి ఆదివాసీలు మద్దతు పలికారు. అనంతరం వినతి పత్రాన్ని రెవెన్యూ కార్యాలయంలో అందజేశారు.

వేసవిలో పశు సంరక్షణపై అవగాహన



అవగాహన సదస్సులో ఏడీ చిట్టినాయుడు

మాడుగుల: వేసవిలో ప్రతి రైతు పశు సంరక్షణ గురించి తెలుసుకోవాలని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకుడు వి. చిట్టినాయుడు సూచించారు. శనివారం స్థానిక పాల కేంద్రం వద్ద రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలు, వేసవి కాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. తీవ్రమైన ఎండలు వల్ల అధిక తాపానికి పశువులు ఉత్పాదక శక్తి కోల్పోతాయన్నారు. ఈ తాపానికి పశువులు మృత్యువాత పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువులను ఉదయం, సాయం కాలం వేళలో మేతకు పంపాలన్నారు. ప్రతి పశువుకు రోజుకు 60 నుంచి 70 లీటర్ల నీరు అందించాలన్నారు. పశువులకు రోగాలు వస్తే టోల్ ఫ్రీ నంబరు 1962కు ఫోన్ చేస్తే పశు అంబులెన్స్ వచ్చి ప్రాథమిక చికిత్స అందిస్తుందన్నారు. కార్యక్రమంలో విశాఖ డెయిరీ అధ్యక్షుడు రావెలపూడి సూరిబాబు, వేతన కార్యదర్శి జోగినాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా వైద్య సేవలు



సూచనలు చేస్తున్న ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి

నాతవరం: ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా రోగులకు వైద్య సేవలందించాలని ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి తెలిపారు. గునుపూడి పీహెచ్‌సీ అభివృద్ధి కమిటి సమావేశం శనివారం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా పీహెచ్‌సీకి సంబంధించి ప్రధాన సమస్యలను వైద్యాధికారి ఎం. సురేష్‌కుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. ఇక్కడ సమావేశ మందిరం లేక ఇబ్బందిగా ఉందన్నారు. పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. సమావేశ మందిరం నిర్మాణానికి మండల పరిషత్ జనరల్ ఫండ్ నిధులు మంజూరు చేస్తానని ఎంపీపీ హామీ ఇచ్చారు. దీనికి సంబంధించి ప్రక్రియ వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్యం, తాగునీరు, తదతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారన్నారు. పేదోడికి ఇంటి వద్దే వైద్యం అందించాలన్న కృతనిశ్చయంతో కొత్తగా ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం ఏర్పాటు చేశారన్నారు. వీటిన్నింటిని దృష్టిలో ఉంచుకుని పీహెచ్‌సీకి వచ్చే రోగులకు వైద్య సేవలు అంకిత భావంతో అందించాలన్నారు. వారి పట్ల నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందన్నారు. పీహెచ్‌సీ అభివృద్ధి కమిటీ సమావేశాలు నిర్ణీత సమయం ప్రకారం నిర్వహించడం వల్ల లోటుపాట్లు సరి చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. పీహెచ్‌సీలో సామగ్రి, ఇతర సమస్యల పరిష్కారానికి పీహెచ్‌సీ అభివృద్ధి నిధులతో చేయడానికి నిర్ణయించారు. కార్యక్రమంలో వైద్యాధికారి వి. పద్మప్రియ, ఆరోగ్య విస్తరణాధికారి నాగేశ్వరరావు ప్రజా ప్రతినిధులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మండల ప్రత్యేకాధికారిగా నాగేశ్వరరావు



నాగేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎంపీడీవో, సిబ్బంది

నాతవరం: మండల ప్రత్యేకాధికారిగా జిల్లా గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా విభాగం ఎస్ఈ బి.వి.వి. నాగేశ్వరరావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు మండల ప్రత్యేకాధికారిగా పని చేసిన ఉపాధి హామీ పథకం అడిషనల్ ప్రాజెక్టు అధికారి ఎం.రోజారాణి కశింకోట మండలానికి బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నియమితులైన ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ నాగేశ్వరరావుకు ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు, మండల స్థాయి అధికారులంతా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తిని కలిసి మండలంలో ప్రధాన అంశాలపై చర్చించారు.

ఉగాదిలోగా ఇళ్ల నిర్మాణాల లక్ష్యం పూర్తి



రామచంద్రాపురంలో ఇళ్ల నిర్మాణాలను పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి

మండల ప్రత్యేకాధికారి ప్రభాకరరావు

మాడుగుల: జగనన్న కాలనీ లేఅవుట్లలో నిర్మిస్తున్న ఇళ్లను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా ఉద్యానవన శాఖాధికారి, మండల ప్రత్యేకాధికారి జి. ప్రభాకరరావు ఆదేశించారు. శనివారం ఆయన స్థానిక మోదమాంబ, రామచంద్రాపురం జగనన్న కాలనీల్లో నిర్మిస్తున్న ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. దాదాపుగా చివరి దశలో ఉన్నవి ఉగాదిలోగా పూర్తి చేయాలని అవగాహన కల్పించారు. ఆగ్రో ద్వారా రైతు ఉత్పత్తి సంఘానికి మంజూరైన కలెక్షన్ కేంద్రం నిర్మాణాలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మీనాకుమారి, గృహ నిర్మాణ శాఖ ఏఈ ఎల్ సత్యనారాయణ పాల్గొన్నారు.

50 మందికి వైద్య పరీక్షలు

మాడుగుల రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌లో భాగంగా ఎ. వీరనారాయణంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 50 మంది రోగులను వైద్యాధికారి కె.ఎం.నాయుడు పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను, అంగన్‌వాడీ కేంద్రం చిన్నారులను పరీక్షించారు. వైద్య సిబ్బంది రాజ్యలక్ష్మి, రాజు తదితరులు పాల్గొన్నారు.

తెగిపడిన విద్యుత్ తీగ

- నిలిచిన ట్రాఫిక్

నర్సీపట్నం: మున్సిపాలిటీలోని చింతపల్లికి వెళ్లే ప్రధాన రోడ్డులో శనివారం విద్యుత్ సర్వీసు తీగ తెగిపడింది. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండటంతో వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. రోడ్డుకు అటు..ఇటు వాహనాలు నిలిచిపోయాయి. విద్యుత్ తీగ వేలాడుతున్నా, కొంతమంది వాహనదారులు నిర్లక్ష్యంగా రాకపోకలు సాగించారు. ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉన్నప్పటికీ ఎవరికీ ఏమి కాకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. తర్వాత విద్యుత్ సిబ్బంది వచ్చి సరి చేశారు.

త్వరితగతిన భవనాల పూర్తిపై డీపీవో అభినందన



తైపురంలో హెల్త్ భవనాన్ని పరిశీలిస్తున్న డీపీవో

బుచ్చెయ్యపేట: తైపురంలో ప్రభుత్వ భవనాల నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయడంపై జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి సంతృప్తి వ్యక్తం చేశారు. శనివారం ఆమె ఇక్కడ పర్యటించి సచివాలయ, రైతు భరోసా, హెల్త్ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రజలకు ఉపయోగపడే మూడు భవన నిర్మాణ పనులు పూర్తి చేయడంతో అధికారులను, నాయకులను అభినందించారు. త్వరలోనే మూడు భవనాలను ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, మండల నాయకులతో కలిసి ప్రారంభోత్సవాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామని సర్పంచ్ ముచ్చకర్ల శ్రీను వివరించారు. గ్రామంలో 44 జగనన్న ఇళ్లకు 39 ఇళ్లు పూర్తి చేయడంతో అధికార్లను డీపీవో అభినందించారు. మిగిలిన ఐదు ఇళ్లు పూర్తి చేయించాలని ఎంపీడీవో సువర్ణరాజు, ఈవోపీఆర్డీ విజయలక్ష్మి, హౌసింగ్ ఏఈ గోపీనాథ్‌లకు సూచించారు. మాజీ సర్పంచ్ డేగల అప్పారావు, వడ్డాది ఈవో లోవరాజు, పంచాయతీ సెక్రటరీ విజయలక్ష్మి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మూడో విడతగా వైఎస్సార్ ఆసరా రూ.9.49 కోట్లు



మాట్లాడుతున్న వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి

నాతవరం: ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు మూడో విడత వైఎస్సార్ ఆసరా కింద 9 కోట్లు 49 లక్షలు 22 వేలు రూపాయలు విడుదల చేసిందని వెలుగు ఏపీఎం మర్రి లక్ష్మి తెలిపారు. అంతర్జాతీయ చిరుధాన్యాల దినోత్సవం సందర్భంగా శనివారం మాధవ నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం సర్పంచ్ సామల చింతల్లి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఏపీఎం మాట్లాడుతూ మండలంలోని 1,321 డ్వాక్రా సంఘాల్లో 14,421 మంది మహిళలకు ఆసరా వర్తిస్తుందన్నారు. వచ్చే నెల మొదట వారంలో సభ్యులు బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తామన్నారు. ఈ విషయాన్ని గ్రామసభలు ద్వారా ప్రతి మహిళకు సంఘానికి వచ్చిన మొత్తాన్ని స్వయంగా తెలియజేస్తామన్నారు. ఇంతవరకు మండల వ్యాప్తంగా మొత్తం రూ.37 కోట్లు 90 లక్షలకు పైగా వచ్చిందన్నారు. మహిళలు, చిన్నారులు, వృద్ధులు, గర్భిణుల్లో రక్తహీనత నివారణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అందులో భాగంగానే అన్ని పంచాయతీల్లో ఈ నెల 31 వరకు అవగాహన సదస్సులు నిర్వహిస్తామన్నారు. విటమిన్లు పుష్కలంగా లభించే ఆకుకూరలు, పప్పు దినుసులు పౌష్టికాహారంగా తీసుకుంటే రక్తహీనత నివారించవచ్చున్నారు. కార్యక్రమంలో వెలుగు సిబ్బంది లక్ష్మీవాసు, మణిరాజ్ పాల్గొన్నారు.

రావికమతంలో భారీ వర్షం



దేవరాపల్లిలో వర్షం కురుస్తున్న దృశ్యం



రావికమతంలో వర్షం కురుస్తున్న దృశ్యం


రావికమతం: మండలంలో భారీ వర్షం కురిసింది. శుక్రవారం నుంచీ వాతావరణం ఒక్కసారిగా మారి చల్లని గాలులు వీస్తూ చిరుజల్లులు పడుతున్నాయి. శనివారం ఉదయం నుంచి సాధారణంగా ఉన్న ఆకాశం మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతం నుంచి దట్టమైన మేఘాలు కమ్ముకుని ఒక్కసారిగా వర్షం కురిసింది. దీంతో ఎన్నాళ్లగానో వర్షం కోసం వేచి చూసిన రైతులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ వర్షానికి భూమి పదునుకుని పచ్చిక మొలుస్తుందని పాడి సంపద పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

నర్సీపట్నంలో...

నర్సీపట్నం: నర్సీపట్నంలో శనివారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. ఒక్కసారి వాతావరణం చల్లబడి ఆకాశం మేఘావృతమై వర్షం కురిసింది. వాతావరణ శాఖ హెచ్చరించిట్లుగానే ఉరుములు, మెరుపులు, ఈదురుగాలలతో కూడిన వర్షం కురిసింది. మధ్యాహ్నం ప్రారంభమైన వర్షం సాయంత్రం 6 గంటల వరకు ఎడతెరిపి లేకుండా పడింది. ఈ వర్షానికి పట్టణంలోని మెయిన్‌రోడ్డుపై ఏరులై పారింది. డ్రైనేజీల్లో పేరుకుపోయిన చెత్తాచెదారం మెయిన్ రోడ్డుపై గుట్టలుగా చేరింది. దీంతో ప్రధాన రోడ్డు చిందరవందరగా తయారైంది. వీధుల్లోని రోడ్లు సైతం వర్షపు నీటితో నిండిపోయాయి.

దేవరాపల్లిలో మోస్తరుగా..

దేవరాపల్లి: మండల వ్యాప్తంగా శనివారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. శనివారం ఉదయం నుంచి మేఘావృతమైన వాతావరణం చల్లచల్లగా కనిపించింది. సాయంత్రం ఒక్కసారిగా తేలికపాటి వర్షం కురిచింది. దీంతో రోడ్లపై వర్షపు నీరు చేరింది. వేసవి ఎండల సమయంలోనూ వర్షం కురవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ వర్షం రబీ పంటలకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆనందం వ్యక్తం చేశారు. వర్షంతోపాటు చలి గాలులు సైతం వీస్తుండటంతో కాస్తా ఇబ్బంది పడుతున్నారు.



నర్సీపట్నం: వర్షపు నీటితో వెంకునాయుడుపేట రహదారి

రిజిస్ట్రేషన్ కార్యాలయం మార్పు తగదు

తుమ్మపాల: పట్టణంలో రిజిస్ట్రేషన్ శాఖ కార్యాలయం మార్పు యోచన విరమించుకోవాలని బీఎస్పీ నేత సూధికొండ మాణిక్యాలరావు జిల్లా రిజిస్ట్రార్‌కు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం ఉన్న భవనం పట్టణంలో అన్ని వసతులతో ఉందని, ఇక్కడ నుంచి కొత్తూరు పంచాయతీకి మార్చడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని చెప్పారు. కనీస సౌకర్యాలు లేని ప్రాంతానికి మార్చడంపై అధికారులు పునరాలోచించాలన్నారు. పాత రిజిస్ట్రేషన్ కార్యాలయ స్థలంలో నూతన భవనాన్ని నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

శ్రీరామ్మూర్తి మాస్టారు నేత్రాలు దానం

చీడికాడ: విశాఖలో చికిత్స పొందుతూ మండల శ్రీరామ్మూర్తి(76) మాస్టారు శనివారం మృతి చెందారు. దాంతో పుట్టెడు దుఃఖంలోనూ ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు ఐ బ్యాంకుకు డోనేషన్ చేసి ఆదర్శంగా నిలిచారు. సాయంత్రం అతడి భౌతికకాయాన్ని స్వగ్రామం జి.కొత్తపల్లిలో సందర్శనార్థం ఉంచారు. 2007లో హెచ్ఎంగా ఉద్యోగ విరమణ పొందారు. అప్పటి నుంచి 16ఏళ్లుగా తన స్వగ్రామంలోని యూపీ స్కూల్‌లో ఎటువంటి రుసుం తీసుకోకుండా పాఠాలు బోధిస్తూ వందలాది మంది విద్యార్థుల ఉన్నతికి బాటలు వేశారు. తన కుటుంబంతో కలిసి చోడవరంలో నివాసం ఉంటున్న ఆయన ఎప్పటి మాదిరిగానే స్కూలుకు ద్విచక్ర వాహనంపై వస్తూ రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వెంటే బీసీలు

- బీసీ రాష్ట్ర కార్యవర్గం ప్రతినిధి పోతల లక్ష్మీశ్రీనివాస్



విజయవాడ బీసీ సదస్సులో మాట్లాడుతున్న పోతల లక్ష్మీశ్రీనివాస్

రోలుగుంట: రాష్ట్ర స్థాయిలో బీసీలకు పలు పదవులు కట్టబెట్టి ప్రాధాన్యమిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంటే తామంతా ఉన్నామని బీసీ రాష్ట్ర కార్యవర్గం ప్రతినిధి పోతల లక్ష్మీశ్రీనివాస్ తెలిపారు. శనివారం విజయవాడలో నిర్వహించిన బీసీ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నామినేటెడ్, మంత్రి మండలి, తదితర అంశాల్లో గత ప్రభుత్వాలు కన్నా అధికంగా పదవులిచ్చి న్యాయం చేశారని ప్రశంసించారు. గ్రామ స్థాయిలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎంపీటీసీలకు, సర్పంచ్‌లకు అధిక ప్రాధాన్యమివ్వాలన్నారు. పార్టీ కార్యకర్తల ద్వారా ప్రభుత్వ కార్యాలయాల్లో అన్ని రకాల పనులు పూర్తి చేయించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లినట్టు ఆయన ఫోన్లో శనివారం రాత్రి సాక్షికి తెలిపారు.

వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం

మాడుగుల రూరల్: బంగాళాఖాతంలో ఏర్పడిన ఆవర్తన ప్రభావంతో కురుస్తున్న అకాల వర్షంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. శనివారం సాయంత్రం 3 గంటల నుంచి కురుస్తున్న వర్షంతో పాటు ఉరుములు, మెరుపులకు మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాత్రి 9 గంటల తర్వాత సరఫరా పునరుద్ధరించారు. పలు చోట్ల చెట్లకొమ్మలు, తాటికమ్మలు, విద్యుత్ తీగల మీద పడటం వల్ల సరఫరాకు తరచూ అంతరాయం కలుగుతుందని మాడుగుల ట్రాన్స్‌కో ఏఈ ఎం. రాంబాబు తెలిపారు. సకాలంలో సిబ్బంది స్పందించి సరఫరా పునరుద్ధరించారు. మరోవైపు జి. అగ్రహారం, వీరనారాయణం, చింతలూరు గ్రామాల్లో మూడు రోజులుగా రోజు రాత్రి 12 నుంచి మరుసటి రోజు ఉదయం 6 గంటల వరకు సరఫరా నిలిచిపోతుందని ఆయా గ్రామాల ప్రజలు వాపోయారు.

ముందస్తు దంత పరీక్షలు మేలు



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్

చోడవరం రూరల్: దంత సమస్యలు ఏర్పడక ముందే వైద్య పరీక్షలు చేయించుకోవడం మేలని ప్రభుత్వ ఆస్పత్రి దంత వైద్యురాలు పి.సరోజిని తెలిపారు. ఓరల్ హెల్త్ వారోత్సవాల్లో భాగంగా శనివారం స్థానిక ప్రేమ సమాజంలో విద్యార్థినులకు, వృద్ధులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పంటికి సంబంధించి చిన్న సమస్య వచ్చినా ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. నోరు శుభ్రంగా ఉంచుకోవడంతో రోగాలు దరిచేరవన్నారు. ఫిజియోథెరపిస్టు రవి పాల్గొన్నారు.